సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం । 19 । డిసెంబర్ । 2024



వేట్లపాలెం హత్యల కేసులో 12 మంది అరెస్టు

వేట్లపాలెంలో జరిగిన దారుణ హత్యల ఘటనలో 12 మందిని అరెస్టు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు తెలిపారు.




రోడ్డెక్కితే షాకే..

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చింది. తీరా గద్దెనెక్కి ఆరు నెలలు పూర్తవుతున్నా వాటిని నెరవేర్చలేకపోతోంది.

8లో

కాలువలకు 11,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 11,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,700, మధ్య డెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.60 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

పోలీసు అధికారులకు ఏబీసీడీ అవార్డులు



డీజీపీ నుంచి ఏబీసీడీ అవార్డులు అందుకుంటున్న ఎస్పీ కృష్ణారావు, ఇతర అధికారులు

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ 'అవార్డు ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్' (ఏబీసీడీ)కు ఎస్పీ బి.కృష్ణారావుతో పాటు జిల్లా పోలీసు అధికారులు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం మంగళగిరిలోని డీజీపీ ప్రధాన కార్యాలయంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా వీటిని అందుకున్నారు. కేసుల త్వరిత పరిష్కారం కోసం ఆధునాతన విధానాలు, వినూత్న మార్గాలను అనుసరించిన ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో ఆయన టీమ్‌లోని పోలీసు అధికారులు ఈ అవార్డులకు ఎంపికయ్యారు. వీరిలో ఎస్పీతో పాటు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు, అమలాపురం తాలూకా ఎస్సై వై.శేఖర్ బాబు, క్రైమ్ సీఐ డి.ప్రశాంత్ కుమార్ ఉన్నారు. అమలాపురంలోని కిమ్స్ వైద్యశాల ప్రాంగణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో గత సెప్టెంబర్ 4వ తేదీ రాత్రి జరిగిన చోరీ కేసును విజయవంతంగా ఛేదించినందుకు డీజీపీ ఈ అవార్డులను ప్రదానం చేశారు.

పుష్కరాలకు ప్రణాళిక



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నారాయణ. చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు వాసు, బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి పుష్కరాల (2027) నిర్వహణకు రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ పరిధిలో రూ.1,587.80 కోట్లతో, కొవ్వూరు డివిజన్ పరిధిలో రూ.280.90 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసినట్టు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ నారాయణ చెప్పారు. బుధవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో కలెక్టర్ పి. ప్రశాంతి, రుడా చైర్మన్, స్థానిక శాసనసభ్యులు, మునిసిపల్ కమిషనర్‌తో ఆయన నగర అభివృద్ధి, పుష్కరాలపై సమీక్ష నిర్వహించారు. మరో 15 రోజుల్లో జిల్లాకి చెందిన అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. 2014 పుష్కరాలకు రూ.2 వేల కోట్లతో నాలుగు మాసాల్లో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇప్పుడు మూడు సంవత్సరాల ముందే ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రానున్న జూన్, జూలై మాసాల్లో పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించే దిశగా చర్యలు చేపడతామన్నారు. కలెక్టర్ ప్రశాంతి గోదావరీ పుష్కరాలు, నగరంలో రహదారుల అభివృద్ధి, మురుగు నీరు, వ్యర్థాల నుంచి ఆదాయ వనరుల అంశాలపై వివరించగా, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన గార్గ్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతిపాదించిన పనులను వివరించారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

నేడు వర్గీకరణ ఏకసభ్య కమిషన్ రాక

కాకినాడ సిటీ: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్‌మిశ్రా ఏక సభ్య కమిషన్ గురువారం కాకినాడ వస్తున్నందున ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ కాకినాడ జిల్లా పర్యటన నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, సాంఘిక సంక్షేమం, రెవెన్యూ పోలీస్ ఇతర శాఖల అధికారులతో సన్నాహక ఏర్పాట్లపై సమీక్షించారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు షెడ్యూల్ ఉపకులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ గురువారం కాకినాడ జిల్లాలో పర్యటించనుందన్నారు. గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు జిల్లా స్థాయి అధికారులతో కమిషన్ సమావేశం అవుతుందని, అనంతరం 11 నుంచి 2 రెండు గంటల వరకు కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో వివిధ ఎస్సీ ఉపకులాల వర్గాల నుంచి వినతులు, విజ్ఞప్తులు స్వీకరిస్తుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో జరిగే ఈ కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

బాదుడే బాదుడు

- భూముల ధరలను పెంచే ఆలోచనలో కూటమి ప్రభుత్వం
- రిజిస్ట్రేషన్ చార్జీల రూపంలో ఆదాయం పెంచుకునే యత్నం
- ఇప్పటికే విద్యుత్ చార్జీలు, ఇంటి పన్నుల పెంపు
- బెంబేలెత్తుతున్న సామాన్యుడు

రావులపాలెంలో వాణిజ్య ప్రాంతం



సాక్షి, అమలాపురం: ఆదాయాన్ని పెంచడం అంటే పరిశ్రమలు తీసుకురావడం, ఉపాధి అవకాశాలు కల్పించడమని అందరికీ తెలుసు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో దీనికి వేరే అర్థం ఉంది. సామాన్యుడి జేబులకు చిల్లులు పెట్టడం, ఖజానాను నింపుకోవడమని ఆయన చేతల్లో నిరూపిస్తున్నారు. పన్నులు, చార్జీలు పెంచడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు, పంచాయతీల ఇంటి పన్నులు పెంచిన కూటమి ప్రభుత్వం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి భూమి విలువలు పెంచడం ద్వారా రిజిస్ట్రేషన్ చార్జీల రూపంలో వినియోగదారులపై భారం మోపేందుకు సిద్ధమవుతోంది.

సర్కారు కసరత్తు

భూములకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించే ధరలు పెంచేందుకు కూటమి సర్కారు కసరత్తు చేస్తోంది. ఇప్పుడున్న భూముల ధరలను పరిగణనలోకి తీసుకుని, వాటికి అదనంగా 10 నుంచి 15 శాతం ధరలు పెంచేందుకు సిద్ధమవుతోంది. తద్వారా కొనుగోలుదారుల నుంచి రిజిస్ట్రేషన్ ఫీజులు, స్టాంప్ డ్యూటీల రూపంలో భారీగా సొమ్ములు చేసుకునేందుకు సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా ఇప్పటికే రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన డీఐజీ స్థాయి ఉద్యోగి శివరాం జిల్లాలో విస్తృతంగా పర్యటించినట్టు సమాచారం. జిల్లాలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాలను పరిశీలించి, ఆయా ప్రాంతాలను బట్టి భూములు విలువ ఎంత శాతం పెంచాలనే దానిపై ఇప్పటికే ప్రభుత్వానికి ఒక నివేదిక పంపినట్లు తెలిసింది. భూముల విలువ పెంచడం ద్వారా ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని కూటమి ప్రభుత్వం ఆశిస్తుంది. కానీ ఈ పెంపు వల్ల కొనుగోలుదారులపై అదనపు భారం పడుతుందని, ఇప్పటికే సంక్షోభంలో ఉన్న రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతోందని అవుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మరింత సంక్షోభం

ఆక్వా రంగం దెబ్బతినడంతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కొనుగోలును నిలుపుదల చేశారు. దీంతో రియల్ ఎస్టేట్ రంగం సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ సమయంలో ప్రభుత్వం భూముల రేట్లు పెంచడం వల్ల రిజిస్ట్రేషన్ చార్జీలు భారంగా మారనున్నాయి. జిల్లాలో ఇళ్ల స్థలాల విక్రయాలు సెంట్ల రూపంలో జరుగుతాయి. ఆ లెక్కన అమలాపురంలోని ముఖ్యమైన వాణిజ్య ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలంపై రిజిస్ట్రేషన్ భారం రూ.46,900 కానుంది. ఈ స్థాయిలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగితే భూములు, ఫ్లాట్లు కొనుగోలు చేసే వారు మరింత వెనుకడుగు వేస్తారని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధరలు పెరిగే విధానం

అమలాపురం పట్టణంలో కమర్షియల్ ఏరియాకు సంబంధించి దేవాంగుల వీధి, దుడ్డివారి అగ్రహారం, కూచిమించి అగ్రహారం, మద్దాలవారి పేట, గడియార స్తంభం సెంటర్ వంటి ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ప్రస్తుతం గజం ధర రూ.29 వేలు. దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ రూపంలో బయట వ్యక్తులకు విక్రయిస్తే రిజిస్ట్రేషన్ ఫీజు 7.5 శాతం చొప్పున రూ. 2,175 అవుతుంది. ప్రభుత్వం 15 శాతం భూమి విలువ పెంచితే ఈ ప్రాంతంలో గజం ధర అదనంగా రూ.4,350 చొప్పున పెరుగుతుంది. అప్పుడు గజం విలువ రూ.33,500 అవుతుంది. ఈ విధంగా చూస్తే దీనిపై రిజిస్ట్రేషన్ చేయించేందుకు గజానికి రూ.2,175 అవుతుంది. అంటే రిజిస్ట్రేషన్‌కు చెల్లిస్తున్న దాని కన్నా గజానికి అదనంగా రూ.326 కట్టాల్సి ఉంది. ఈ విధంగా చూస్తే 100 గజాల స్థలానికి రిజిస్ట్రేషన్ చార్జి రూపంలో అదనంగా రూ.32,600 వరకూ పెరగనుంది.

- అమలాపురంలో నివాస ప్రాంతాలకు సంబంధించి ప్రస్తుతం గజానికి ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.18,500. దీనికి 7.5 శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు రూ.1,387 వరకూ అవుతాయి. భూముల ధరను ప్రభుత్వం 15 శాతం పెంచితే గజానికి రూ.2,775 వరకూ పెరిగి రూ.21,275 కానుంది. అప్పుడు రిజిస్ట్రేషన్ ధర గజానికి రూ.1,595 వరకూ చెల్లించాలి. అంటే ఇప్పుడున్న దానికి అదనంగా రూ.208 చొప్పున పెరుగుతుంది.
- జిల్లా ముఖద్వారమైన రావులపాలెం గ్రామ పంచాయతీ అయినప్పటికీ వ్యాపార పరంగా అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ భూముల ధరలు వాణిజ్య ప్రాంతాల్లో గజం ధర రూ.9 వేల నుంచి రూ.15 వేల వరకు ఉన్నాయి. రూ.15 వేలు ఉన్న ప్రాంతంలో ప్రస్తుతం గజం రిజిస్ట్రేషన్ ధర రూ.1,125. ఇప్పుడు ప్రభుత్వం భావిస్తున్నట్టుగా వాణిజ్య ప్రాంతాలలో భూములు ధరలను 15 శాతం పెంచితే గజం ధర అదనంగా రూ.2,250 పెరగనుంది. ఈ ప్రకారం రిజిస్ట్రేషన్ విలువ గజానికి రూ.1,293 పెరగనుంది. అంటే రిజిస్ట్రేషన్ రూపంలో గజానికి రూ.168 వరకు ప్రభుత్వానికి ఆదాయం రానుంది.
- రావులపాలెంలోని నివాస ప్రాంతాలలో గజం ధర రూ.5500 వరకూ ఉంది. దీనికి అయ్యే రిజిస్ట్రేషన్ విలువ రూ.412. ఇక ప్రభుత్వం 15 శాతం చొప్పున భూముల విలువ పెంచితే ఇక్కడ గజం ధర మరో రూ.500 పెరిగి రూ.6 వేలు అవుతుంది. రిజిస్ట్రేషన్ చార్జి రూ.450 కానుంది. ఇప్పుడున్న దానికన్నా అదనంగా రూ.37.50 చొప్పున పెరగనుంది. 100 గజాలు కొనుగోలు చేస్తే అదనంగా రూ.3,750 వినియోగదారులకు భారం కానున్నది
- గల్ఫ్ దేశాలలో ఉంటూ ఇక్కడ భూములు కొనుగోలుపై పెట్టుబడులు పెట్టేవారు అధిక సంఖ్యలో ఉన్న మలికిపురం ప్రాంతంలో భూముల ధరలు అధికం. ముఖ్యంగా మలికిపురం పట్టణంలో వాణిజ్య ప్రాంతంలో గజం ధర రూ.16 వేల వరకూ ఉంది. కూటమి ప్రభుత్వం ధరలు పెంచితే అది రూ.18,400 అవుతుంది. రిజిస్ట్రేషన్ చార్జి, ఇతర ఫీజులు కలిపి ఇప్పటి వరకు రూ.1,200లు కాగా, ఇక నుంచి రూ.1,300 చొప్పున కానుంది.
- కపిలేశ్వరపురం మండలం అంగరలో ఇళ్ల స్థలం ఖరీదు గజం రూ.2 వేల వరకూ ఉంది. ఇప్పుడు ఇది రూ.2,300లు కానున్నది. సెంటు భూమి రిజిస్ట్రేషన్ ఇప్పటి వరకు రూ.7,200 కాగా, ప్రభుత్వం భూముల ధరలు పెంచితే రూ. 8,250కి పెరుగుతుంది.

స్తంభించిన రియల్ ఎస్టేట్

జిల్లాలో ఆరు నెలలుగా రియల్ ఎస్టేట్ రంగం **పూర్తిగా స్తంభించిపోయి**ంది. అపార్ట్‌మెంట్లలో **ఫ్లాట్లతో పాటు ఇళ్ల స్థ**లాలు, వ్యవసాయ **భూముల క్రయ విక్రయా**లు దాదాపు నిలిచి **పోయాయి. జిల్లా కేంద్ర**మైన అమలాపురంతో **పాటు రామచంద్రపురం**, మండపేట మున్సిపా**లిటీలు, ముమ్మిడివరం** నగర పంచాయతీ, **రావులపాలెం, కొత్తపేట**, రాజోలు, మలికిపురం, **అంబాజీపేట వంటి ప్రాం**తాల్లో రియల్ ఎస్టేట్ **గతంలో చురుగ్గా ఉండే**ది. పట్టణాలు, ప్రధాన **పంచాయతీలను ఆనుకు**ని ఉన్న గ్రామాల్లో సైతం పెద్ద ఎత్తున **లేఅ**వుట్లు పుట్టుకొచ్చాయి. కానీ ఆరు నెలలుగా అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు, ఇళ్ల స్థలాల అమ్మకాలు గతేడాదితో పోల్చుకుంటే 20 శాతం కూడా లేవు. జిల్లాలో రియల్ ఎస్టేట్‌పై ఆక్వా రైతులు, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లో ఉన్న సాఫ్ట్ వేర్ ఉద్యోగులు పెట్టుబడి పెట్టేవారు.



కపిలేశ్వరపురం మండలం అంగరలోని నివాస ప్రాంతం

అమలాపురం పట్టణం



ఉచిత ఇసుక విధానంలో స్పష్టత ఏది?



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్ తదితరులు



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలు త్రిమూర్తులు, సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్

- మద్యం పాలసీలో అన్ని లొసుగులే
- జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో ఎమ్మెల్యేలు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలు

అమలాపురం టౌన్/ అమలాపురం రూరల్: కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో కొందరు అధికార పక్ష ఎమ్మెల్యేలు ఇసుక పాలసీపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మద్యం కొత్త పాలసీలోని లొసుగులను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలు ఎండగట్టారు. అనధికార మద్యం బెల్ట్ షాపుల నియంత్రణ ఏది అంటూ ధ్వజమెత్తారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా ప్రగతి పరంగా పరుగులు పెడుతోందని చెబుతూనే, తలసరి ఆదాయపరంగా బాగా వెనకబడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జిల్లా తలసరి రూ.1.80 లక్షలుగా ఉందని, 22వ స్థానంలో నిలిచిందని తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు (కొత్తపేట), వేగుళ్ల జోగేశ్వరరావు (మండపేట) మాట్లాడుతూ ఉచిత ఇసుక సరఫరాలో స్పష్టత లోపించిందన్నారు. దీనిపై ప్రభుత్వం పూర్తిస్థాయి స్పష్టతతో చర్యలు చేపట్టాలన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంపై అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పేది ఒకటి క్షేత్ర స్థాయిలో జరిగేది మరొకటి అని ధ్వజమెత్తారు. ఇసుక, మద్యం పాలసీల్లో ఎమ్మెల్యేలు ఎవరూ వేలు పెట్టవద్దని, బెల్ట్ షాపులు కనిపిస్తే భారీ జరిమానాలు వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్న విషయాలన్నీ ప్రసంగాలకే పరిమితం అవుతున్నాయన్నారు. ఉచిత ఇసుక ఎక్కడ అమలవుతుందో చెప్పాలని నిలదీశారు. లైసెన్స్ మద్యం దుకాణానికి అనుబంధంగా కొన్ని బెల్ట్ షాపులు అనధికారికంగా పెడుతున్నా ఎమ్మెల్యేలు, అధికారులు ఏమి చేస్తున్నారని ఎమ్మెల్సీలు ప్రశ్నించారు. జనసేన ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ (పి.గన్నవరం), దేవ వర ప్రసాద్ (రాజోలు) మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీపై మాట్లాడుతూ అమలు ఇంకా స్ట్రీమ్ లైన్‌లో పడాలని సూచించారు.

ప్రభుత్వ విధానాలపై ఎమ్మెల్సీ తోట ధ్వజం

మద్యం, ఇసుక అక్రమాలపై పూర్తి నిఘా పెట్టినట్లు, ఆ అక్రమాలపై ఉక్కు పాదం మోపుతానని సీఎం చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాటలు ఏ ఒక్కటీ అమలు కావడం లేదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ధ్వజమెత్తారు. మద్యం షాపుల్లో కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలకు వాటాలు ఉన్నాయని ఆరోపించారు. పెన్షన్లు, ఇసుక, మద్యం విషయాల్లో ప్రజలు చాలా వ్యతిరేకత, అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. ఎమ్మెల్సీలు సూర్యనారాయణ రావు, ఇజ్రాయిల్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి పలు అంశాలపై సమీక్ష మంత్రి అచ్చెన్నాయుడు సమావేశంలో జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై సమీక్షించారు. కోనసీమ జిల్లా విజన్ 2047 డాక్యుమెంటును ఆవిష్కరించారు. జిల్లా ప్రజలకు పలు ప్రభుత్వ విధానాల ద్వారా అందుతున్న ఫలాలను వివరించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని 12 ఇసుక రీచ్‌ల ద్వారా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సహకారంతో ఇసుక తవ్వకాలు ప్రారంభించి డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక సరఫరాకు చర్యలు చేపట్టామన్నారు. అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు కూడా సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతితోపాటు జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్బన్ అథారిటీలతో అన్ని ప్రాంతాల అభివృద్ధి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు
- అముడా చైర్మన్‌గా స్వామినాయుడి ప్రమాణ స్వీకారం



స్వామినాయుడితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జేసీ నిషాంతి, చిత్రంలో మంత్రులు అచ్చెన్నాయుడు, సుభాష్ తదితరులు

అమలాపురం టౌన్: అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీలతో అన్ని ప్రాంతాలు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందుతాయని జిల్లా ఇన్‌చార్జి, వ్యవసాయశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో బుధవారం అమలాపురం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్ అల్లాడ స్వామినాయుడి ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన జరిగిన ఈ సభకు మరో ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ హాజరయ్యారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కొత్తపేట, మండపేట, ముమ్మిడివరం ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, దాట్ల బుచ్చిబాబు ప్రసంగించారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధిలో ఉన్న రామచంద్రపురం, మండపేట పట్టణాలను అముడాలో విలీనం చేయాలని ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. అముడా చైర్మన్‌గా అల్లాడ స్వామినాయుడుతో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ప్రమాణ స్వీకారం చేయించారు. అమలాపురం నియోజకవర్గంలో రెండు వర్గాలుగా ఉన్న జనసేన పార్టీ సంబంధించి ఒక వర్గానికి చెందిన నాయకులకే ఈ వేదికపై స్థానం కల్పించడంతో చర్చనీయాంశమైంది.

హత్యలు, అత్యాచారాలను అరికట్టాలి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మైనార్టీలు, మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలు అరికట్టాలని సీపీఎం 14వ జిల్లా మహాసభలో రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన ముగింపు సభలో ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో లక్ష మందికి పైబడి కౌలు రైతులు ఉంటే కనీసం సగం మందికి కూడా కౌలు రైతుకార్డులు మంజూరు చేయలేదన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వ నిబంధనలు అడ్డంగా మారాయన్నారు. తరచూ సంభవిస్తున్న తుపానుల కారణంగా వర్షాలు కురవడంతో ధాన్యంతో తేమశాతం పెరుగుతోందన్నారు. దీంతో రైతులు బస్తాను రూ.300 నుంచి రూ.400 నష్టానికి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అవుతున్నా దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మహిళలపై దాడులు తగ్గడం లేదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంధ్ర మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో అంబేద్కర్‌ను ఎగతాళి చేసి అహంకారంగా మాట్లాడటం దుర్మార్గమన్నారు.

సీపీఎం జిల్లా కార్యవర్గం ఎన్నిక

జిల్లా సీపీఎం పార్టీ ప్రథమ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్‌గా కారెం వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులుగా కె.కృష్ణవేణి, జి.డాక్టర్ చల్లా రవికుమార్, డీవీ రావు, దుర్గాప్రసాద్, నూకల బలరాం, టి.నాగవరలక్ష్మి, ఎస్.జోగేష్, డీపీ లక్ష్మి ఎంపికయ్యారు.

విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



గురుకుల పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ సలీం బాషా

ముమ్మిడివరం: వసతి గృహాల్లోని విద్యార్థుల సంక్షేమానికి అధికారులు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా అన్నారు. ముమ్మిడివరం మండలం తానేల్లంక ఏపీ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అక్కడ నెలకొన్న అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దానివల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యారుల నోట్స్, వర్క్ బుక్‌లను పరిశీలించారు. హెచ్ఎం పర్యవేక్షణ సంతృప్తికరంగా లేకపోవడాన్ని గమనించి తగిన సూచనలు చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ

కాకినాడ సిటీ: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కాకినాడ జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు జనవరి 2, 2025 నుంచి కాకినాడలో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్టు వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి ఎం.సుబ్బారావు బుధవారం ప్రకటనలో తెలిపారు. స్టైఫండ్, బుక్స్ అలవెన్సు సౌకర్యాలు ఉన్నాయన్నారు. అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు వారి రెజ్యూమ్‌తో పాటు 10వ తరగతి, ఇంటర్, క్యాస్ట్, ఎస్‌జీటీ టెట్ క్వాలిఫై కాపీ, రెండు పాస్ పోర్టుసైజ్ ఫొటోలు, సెల్ఫ్ అడ్రస్ కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయం, ప్రగతి భవనం, 2వ అంతస్తు, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఎదురుగా, కాకినాడ చిరునామాకు ఈ నెల 28వ తేదీ లోపు పంపాలి. వివరాలకు 0884-2379216 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,500
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	10,000 – 11,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

రైసుమిల్లుపై విజిలెన్స్ దాడులు

ఆలమూరు: మోదుకూరులోని శ్రీలక్ష్మీ గణపతి రైసుమిల్లుపై విజిలెన్స్ దాడులు జరిగాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణా నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ సివిల్ సప్లయిస్ లీగల్ మెట్రాలజీ అధికారులు డీఎస్పీ తాతారావు, సీఐ టి.నాగ వెంకటరాజు, తహసీల్దార్ విజయ్ కుమార్, సీఐజీటీ పద్మ నేతృత్వంలో ఐదుగురు అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ ఈ కార్యక్రమం కొనసాగింది. ఏటా రైసుమిల్లుల్లో నిర్వహించే మాదిరిగానే మోదుకూరులో కూడా తనిఖీలు చేసినట్టు విజిలెన్స్ సీఐ నాగ వెంకటరాజు తెలిపారు. మిల్లులో రేషన్ బియ్యం ఆనవాళ్లు ఏమీ లేవని, దీనికి సీఎంఆర్ అనుమతి ఉందని తెలిపారు. స్టాంపింగ్‌ను రెన్యువల్ చేయాలని ఆదేశించామన్నారు.

21 నుంచి ఏయూ దూరవిద్య తరగతులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రా యునివర్సిటీ దూరవిద్యాకేంద్రం ద్వారా 2024 – 25 విద్యా సంవత్సరం అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఈ నెల 21 నుంచి వారంతపు తరగతులు ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని కో ఆర్డినేటర్ తిరుపాణ్యం బుధవారం తెలిపారు. బీఏ, బీకామ్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు డిసెంబర్ 21, 22, 28, 29, అలాగే జనవరి 11, 12, 18, 19, 25, 26 తేదీల్లో తరగతులు జరుగుతాయన్నారు. ఆ రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ నిర్వహిస్తామన్నారు.

రోడ్డెక్కితే షాకే..

- **టోల్ బాదుడుకు కూటమి ప్రభుత్వం సిద్ధం**
- **తొలి దశలో రెండు, మలి దశలో ఏడు రహదారులకు ప్రణాళిక**
- బెంబేలెత్తుతున్న వాహనచోదకులు
- నిత్యావసరాల ధరలు పెరిగే ప్రమాదం

ఆలమూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చింది. తీరా గద్దెనెక్కి ఆరు నెలలు పూర్తవుతున్నా వాటిని నెరవేర్చలేకపోతోంది. ఉమ్మడి జిల్లాలోని రహదారులను పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్న హామీ నేటికీ నెరవేర్చలేదు. ఈ విషయంలో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రత్యామ్నాయ పద్ధతులు వెతికే పనిలో పడింది. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్ర రహదారులపై టోల్ గేట్లు ఏర్పాటు చేయాలని ముసాయిదాను సిద్ధం చేసింది. దానిలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో తొలుత రెండు రాష్ట్ర రహదారులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. వీటి పరిస్థితి, ఆదాయాన్ని బట్టి రెండో విడతతో మరో ఏడు రహదారులకు వర్తింపజేయనుంది.

తొలి విడతలో..

ఉమ్మడి జిల్లాలోని జొన్నాడ – కాకినాడ రోడ్డులో 48.4 కిలోమీటర్లు, రాజమహేంద్రవరం – కాకినాడకు వెళ్లే కెనాల్ రోడ్డులోని 65.20 కిలోమీటర్ల రహదారులను తొలి విడతగా అభివృద్ధి చేసి, ఆ మేరకు టోల్ వసూలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. దీనిలో భాగంగా ఆ రోడ్లపై రాకపోకలు సాగించే వాహనాల రద్దీపై అధికారులు సర్వే చేస్తున్నారు. ఆ నివేదిక అనంతరం టోల్ గేట్ల ఏర్పాటు, ధరల నిర్ధారణ జరగనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 15 వేల వరకూ భారీ వాహనాలు, కార్లు ఉన్నాయి. ఇప్పటికే ఎన్‌హెచ్ 16, 216, 216ఏ జాతీయ రహదారులపై టోల్‌గేట్ల ద్వారా వాహన చోదకులపై తీవ్ర భారం పడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మండపేట బైపాస్ రోడ్డులోని టోల్ గేట్‌ను పూర్తిగా తొలగించి ప్రయాణికులపై భారాన్ని తగ్గించారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పీపీపీ విధానంలో 508.04 కిలోమీటర్ల మేర తొమ్మిది రహదారులను అభివృద్ధి చేసి టోల్‌గేట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. తొలివిడతలో 114.04 కిలోమీటర్లు, రెండో విడతలో 394.48 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టింది. ఒక్కొక్క రహదారిలో రెండేసి చొప్పున టోల్‌గేట్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం జాతీయ రహదారి16పై జగ్గంపేట మండలం కృష్ణవరం వద్ద, ఎన్‌హెచ్ 216పై ముమ్మిడివరం మండలం అన్నంపల్లి వద్ద, ఎన్‌హెచ్ 216ఏపై ఈతకోట వద్ద టోల్‌గేట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో రాకపోకలు సాగించాలంటే ఒక్కొక్క వాహనానికి రూ.1000 వరకూ టోల్ చెల్లించాలి. రాష్ట్ర రహదారులపైనా టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తే తమపై పెనుభారం పడుతుందని వాహనాల యజమానులు ఆందోళన చెందుతున్నారు, ఈ ప్రభావం పరోక్షంగా నిత్యావసరాలు, ఇతర వస్తువులపై పడి వాటి ధరలు పెరుగుతాయి. చివరకు ప్రజలకు భారంగా మారతాయి.

నగరాలలో సైతం

రాష్ట్ర రహదారులపై ప్రయాణించే వారిపైనే కాదు నగరాల్లో నివసిస్తున్న ప్రజలపై కూడా టోల్ బాదుడుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాజమహేంద్రవరం, కాకినాడ నగర పాలక సంస్థల్లో పీపీపీ విధానంలో 47.35 కిలోమీటర్ల మేర డెవలప్ చేయనున్నారు. రాజమహేంద్రవరంలో 7.68, కాకినాడలో 39.67 కిలోమీటర్లు అభివృద్ధి చేయనున్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్రంలోని నగరాల్లోని రహదారులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేలా ఒప్పందం కుదుర్చుకోవాలని ఆదేశించింది. నగరాల్లో రహదారులను అభివృద్ధిని చేసిన కాంట్రాక్టర్లకు పదేళ్ల పాటు వివిధ రూపాల్లో ఆదాయం సమకూర్చుకునేందుకు వెసులుబాటు కల్పించనుంది.

టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తారిలా..

తొలి విడతలో..	
జొన్నాడ – కాకినాడ	48.84 కి.మీ
రాజమహేంద్రవరం – కాకినాడ (కెనాల్ రోడ్డు)	65.20 కి.మీ
మలి విడతలో..	
అమలాపురం-బొబ్బర్లంక	49,77 కి.మీ
సామర్లకోట-గోకవరం	49.20 కి.మీ
తుని-నర్సీపట్నం	48.80 కి.మీ
రాజమహేంద్రవరం - భద్రాచలం	91.54 కి.మీ
రాజవరం-పొదలాడ	60.86 కి.మీ
కాకినాడ-రాజానగరం	42.19 కి.మీ
తుని-కత్తిపూడి	52.12 కి.మీ



రావులపాలెం మండలం ఈతకోటలో 216 జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్‌గేట్



మండపేట బైపాస్ రోడ్డులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తొలగించిన టోల్‌గేట్



రాజమహేంద్రవరం- కాకినాడ కెనాల్ రోడ్డు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సమిశ్రగూడెం లోహియ నగర్‌కు చెందిన కాండ్రు రాంబాబు (27) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక వైఎస్సార్ కాలనీలో క్రిస్మస్ వేడుకలకు సంబంధించి మెయిన్ లైన్‌కు వైర్లు బిగిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతడిని వెంటనే నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య వీరవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీను కేసు నమోదు చేశారు. రాంబాబు దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వైభవ్ జ్యూయలర్స్ ప్రారంభం



అమలాపురంలో షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్: అమలాపురం మెయిన్ రోడ్డులో ముమ్మిడివరం గేట్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వైభవ్ జ్యూయలర్స్‌ను బుధవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సీఎండీ భారత మల్లికా రత్నకుమారి గ్రంధి మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లో తమకు 16 బ్రాంచ్‌లు ఉన్నాయని, అమలాపురంలో 17వ బ్రాంచ్ ప్రారంభించినట్టు తెలిపారు. మెరుగైన డిజైన్, ఉత్తమ నాణ్యత కలిగిన బంగారు, వజ్ర, రత్న, వెండి ఆభరణాల విక్రయాలు సాగిస్తూ కస్టమర్ల విశ్వాసం పొందామన్నారు. ఆ సంస్థ హోల్ టైమ్ డైరెక్టర్ సాయి కీర్తన గ్రంధి, సీఓఓ గొంట్ల రాఖాల్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సింధూరి గ్రంధి, మేనేజింగ్ డైరెక్టర్ అమరేంద్ర గ్రంధి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ జె.రఘునాథ్ ప్రసంగించారు. సాధారణ బంగారు ఆభరణాలపై తరుగు (వీఏ) 6.9 శాతం నుంచి, సాధారణ వెండి వస్తువులు, పట్టీలపై తయారీ చార్జీలు లేకుండా అమలాపురం షోరూమ్ అందుబాటులోకితెచ్చామన్నారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మెట్ల రమణబాబు, బీవీసీ ఇంజినీరింగ్ విద్యా సంస్థల అధినేత బోనం కన కయ్య, అల్లాడ శరత్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'మన అమలాపురం గురించి తెలుసుకుందాం' అనే అంశంపై నిర్వహించిన డ్రాలో గెలుపొందిన 10 మంది విజేతలకు ఒక్కొక్కరికి 1 గ్రా ము 22 క్యారెట్ బంగారు కాయిన్ అందజేశారు.

నాలుగు గంటల్లోనే మహిళ ఆచూకీ లభ్యం

కాకినాడ క్రైం: మతి స్థిమితం లేక ఇంటి నుంచి వెళ్లిపోయిన వృద్ధురాలి ఆచూకీని గంటల వ్యవధిలోనే పోలీసులు కనిపెట్టారు. కాకినాడ టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు తెలిపిన వివరాల మేరకు.. కాకినాడ గాంధీనగర్‌లోని ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ వెనుక జెట్టి వెంకటేశ్వరరావు, అతడి భార్య లక్ష్మి నివాసముంటున్నారు. 72 ఏళ్ల వయసున్న లక్ష్మికి మతిస్థిమితం లేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. వెంటనే వెంకటేశ్వరరావు కాకినాడ టూటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ రఘువీర్ ద్వారా ఎస్పీ విక్రాంత్ పాటిల్ దృష్టికి ఈ విషయం వెళ్లింది. ఆయన ఆదేశాలతో పోలీసులు నగరాన్ని నాలుగు గంటల పాటు జల్లెడ పట్టారు. చివరకు కలెక్టరేట్ వెనుక రోడ్డులోని ఓ నిర్మానుష్య ప్రాంతంలో లక్ష్మిని కనిపెట్టారు. ఆమెకు కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేవలం నాలుగు గంటల వ్యవధిలో మహిళ ఆచూకీ కనిపెట్టిన టూటౌన్ సీఐ అప్పలనాయుడు, ఆయన బృందాన్ని ఎస్పీ అభినందించారు.



లక్ష్మిని ఆమె భర్తకు అప్పగిస్తున్న సీఐ అప్పలనాయుడు, పోలీసులు

పంట మార్పిడితో ఎంతో ప్రయోజనం

నల్లజర్ల: రబీలో పొగాకు సాగు చేస్తున్న రైతులు సార్వాలో తమ భూములను ఖాళీగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ కరుణశ్రీ సూచించారు. పోషకాహార భద్రతా పథకంలో భాగంగా సుభద్రపాలెం రైతు సేవాకేంద్రంలో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కరుణశ్రీ మాట్లాడుతూ పంటమార్పిడి విధానాన్ని వివరించారు. సార్వా సీజన్‌లో భూములను ఖాళీగా ఉంచకుండా మొక్కజొన్న, అపరాల సాగు చేపట్టాలన్నారు. దాని ద్వారా 365 రోజులు భూమి పచ్చదనంతో ఉంటుందని, భూమిలో పోషకాల లభ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞన కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త పి.విజయలక్ష్మి, టీఆర్‌సీ ఏఓ బి.వెంకన్నబాబు, ఏఈఓ పుష్పలత, వ్యవసాయ సహాయకురాలు సౌజన్య, గ్రేస్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త కరుణశ్రీ

వేట్లపాలెం హత్యల కేసులో 12 మంది అరెస్టు

- పాతకక్షలు కూడా కారణమే
- డీఎస్పీ శ్రీహరిరాజు

సామర్లకోట: వేట్లపాలెంలో జరిగిన దారుణ హత్యల ఘటనలో 12 మందిని అరెస్టు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు తెలిపారు. సామర్లకోట పోలీసు స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ రాత్రి కర్దాల చంద్రరావు, ప్రకాశరావు, ఏసుబాబును కొందరు కత్తులతో దాడి చేసి హత్య చేసిన విదితమే. ఈ మేరకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించారు. వేట్లపాలెం ఇండస్ట్రియల్ ఏరియా సమీపంలోని జీవీకే పవర్ ప్లాంట్ వద్ద బుధవారం మధ్యాహ్నం 2.15 గంటలకు 12 మందిని అరెస్టు చేశారు. పాతకక్షలు కూడా ఈ ఘటనకు కారణమని డీఎస్పీ తెలిపారు.

కత్తులు, కర్రలు, ఆటో స్వాధీనం

ప్రధాన నిందితులైన బచ్చల జకరయ్య, మోసే, బుల్లెప్పి, దొరయ్య, రాము, గోపిన, గవరయ్య, రాజు, సూర్యకాంతం, భాగ్యవతి, ద్రోణం సత్యవేణి, కొత్తపల్లి చిన్నిలను పోలీసులు అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు.దాడికి ఉపయోగించిన ఐదు కత్తులు, మూడు కర్రలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామని, వాటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. రెండు వర్గాల మధ్య మూడు నెలలు ఈ వివాదం జరుగుతున్నా పోలీసులకు ఎటువంటి సమాచారం లేదన్నారు. పండు కాకినాడలో పని చేస్తూ ఇంటి నిర్మాణం చేసుకుంటున్నాడని, అపరాధ రుసుం చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చనే ఉద్దేశంతో పనులు చేపట్టాడన్నారు. ఈ ఘటనలో 20 మందిని అనుమానితులు కాగా, వారిలో 12 మందిని అరెస్టు చేశామని, వీరందరూ అదే గ్రామానికి చెందిన వారన్నారు. సమావేశంలో సీఐ ఎ.కృష్ణ భగవాన్, క్రైం సీఐ అంకబాబు పాల్గొన్నారు.

శ్లాబ్ వేస్తుండగా దాడి

కాగా..మాల చెరువు స్థలం సమీపంలో కార్దాల పండు ఇంటి నిర్మాణం చేసుకుంటుండగా, దాన్ని అదే గ్రామంలోని ఎస్సీ కులానికి చెందిన బచ్చల జకరయ్య, బచ్చల మోసే, బచ్చల బుల్లెప్పి దాన్ని వ్యతిరేకిస్తున్నారు. మాలల చెరువును ఆక్రమించరాదని, భవన నిర్మాణం చేయరాదని వారు ఎన్ని పర్యాయాలు చెప్పినా పండు నిర్మాణ పనులు ఆపలేదు. దీంతో ఈ నెల 15వ తేదీ సాయంత్రం ఇంటికి శ్లాబ్ వేస్తున్న సమయంలో నిందితులు దాడి చేశారు. ఈ ఘటనలో కార్దల ప్రకాశరావు, కార్దాల చంద్రరావు, కార్దాల ఏసుబాబు మృతి చెందారు. కాగా.. ఈ గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతోంది.



విలేకర్లకు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ శ్రీహరి రాజు, చిత్రంలో సీఐలు

డమ్మీ తుపాకీతో బెదిరించి నగలు చోరీ

- కాకినాడ తనిష్క్ జ్యువెలరీ షోరూంలో ఘటన
- దొంగను వెంబడించి పట్టుకున్న పోలీసులు

కాకినాడ క్రైం: డమ్మీ తుపాకీతో బెదిరించి, బంగారం దుకాణం నుంచి ఆభరణాలను ఎత్తుకెళ్లిన ఘటన కాకినాడలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని దేవాలయంలో వీధిలో ఉన్న తనిష్క్ జ్యువెలరీ షోరూంకు బుధవారం మధ్యాహ్నం ఒక వ్యక్తి వచ్చాడు. జెంట్స్ ఆర్నమెంట్స్ విభాగానికి వెళ్లి తనకు గోల్డ్ కాయిన్లు, బంగారు గొలుసులు చూపించాలని అక్కడి సేల్స్‌మన్‌ను అడిగాడు. వాటిని చూపిస్తూ ఉండగా ఒక్కసారిగా తన వద్ద ఉన్న తుపాకీ తీసి గురిపెట్టాడు. సేల్స్‌మన్‌ను బెదిరించి ఆ బంగారు గొలుసులు తన జేబులో కుక్కుకుని పరారయ్యాడు. షోరూం భద్రతా సిబ్బంది తేరుకునే సరికి రెప్పపాటులో మాయమయ్యాడు. సెక్యూరిటీ సిబ్బంది సమాచారం మేరకు లా అండ్ ఆర్డర్‌తో సహా ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆ దొంగను వెంబడించి వార్ఫ్ రోడ్డులో పట్టుకున్నారు. అతడి నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అది 39 గ్రాములు ఉందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. నిందితుడిని అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామానికి చెందిన నూకల సతీష్‌గా గుర్తించామని వన్ టౌన్ సీఐ నాగదుర్గారావు, ట్రాఫిక్ సీఐ నూని రమేష్ తెలిపారు. అతడు బెంగళూరులో కొన్నాళ్లు ఉద్యోగం చేశాడని, ప్రస్తుతం ఆవారాగా తిరుగుతున్నాడని అన్నారు. దొంగను ట్రాఫిక్ పోలీస్ ఎస్వీ రమణ వెంబడించి పట్టుకున్నాడని తెలిపారు. నిందితుడు వినియోగించింది ఓ డమ్మీ తుపాకీ అని తేల్చారు. అతడిపై పాత కేసులు ఏవైనా ఉన్నాయా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తక్షణమే స్పందించిన ట్రాఫిక్ పోలీస్ రమణ సహా సీఐలు నాగదుర్గారావు, నూని రమేష్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.



దొంగ నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం



చోరీకి పాల్పడిన నూకల సతీష్

హాకీ పోటీలకు అక్కు జట్టు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తమిళనాడులోని తిరుచినాపల్లి భారతీదాస్ యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి జరిగే అంతర్ యూనివర్సిటీ హాకీ పోటీలకు అక్కు జట్టు ఎంపిక చేశారు. స్థానిక డీఎస్ఏ హాకీ మైదానంలో కోచ్ రవిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 18 మందిని ఎంపిక చేశారు. కళాశాల పీడీలు వర్మ, రమణ, కోచ్ నాగేంద్ర పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన అక్కు పవర్ లిఫ్టింగ్ పురుషులు, మహిళల పోటీల్లో ఇదే కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పురుషుల విభాగంలో రెండు బంగారు, మూడు రజత, నాలుగు కాంస్య పతకాలతో పాటు, టీం చాంపియన్‌షిప్‌ను సాధించినట్టు పీడీ రమణ తెలిపారు. అలాగే మహిళల విభాగంలో రెండు బంగారు, ఒక రజత పతకం సాధించారు.

బీచ్‌లో కారు నుంచి బంగారం చోరీ

కాకినాడ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం పసలపూడికి చెందిన కొవ్వూరి రామచంద్రారెడ్డికి చెందిన కారులోని 40 కాసులు బంగారు వస్తువులు కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లో చోరీకి గురైన సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిమ్మాపురం పోలీసుల వివరాల మేరకు, ఆదివారం కాకినాడ వచ్చిన రామచంద్రారెడ్డి, కుటుంబ సభ్యులు బీచ్‌ను సందర్శించేందుకు కారుకు తాళం వేసి వెళ్లారు. కొద్దిసేపు బీచ్‌లో గడిపి, తిరిగి ప్రయాణమయ్యారు, మార్గంలో కారులో ఉంచిన బంగారు వస్తువులను పరిశీలించగా, కనిపించ లేదు. దీంతో వెనక్కి చేరుకుని బీచ్‌లో విచారించి, అక్కడ నుంచి తిమ్మాపురం పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రవీంద్రబాబు తెలిపారు., బహిరంగ మార్కెట్‌లో సొత్తు విలువ రూ.20 లక్షల పైబడి ఉండగా, పోలీసులు మాత్రం రూ.6.90 లక్షలు ఉంటుందని నమోదు చేశారు. రూరల్ సీఐ చైతన్యకృష్ణ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పని ఒత్తిడిని జయించేందుకు క్రీడలు దోహదం



ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంతో కమాండెంట్ దీపిక

- ఎస్పీ విక్రాంత్ పాటిల్
- ఏపీఎస్పీలో ముగిసిన గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్

కాకినాడ రూరల్: పని ఒత్తిడిని జయించేందుకు క్రీడలు దోహదపడతాయని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. రమణయ్యపేటలో కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ వార్షిక గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం బుధవారం రాత్రి జరిగింది. ఎస్పీతో పాటు కలెక్టర్ షణ్మోహన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారికి కమాండెంట్ దీపిక, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. సిబ్బందిలో జోష్ నింపేందుకు ఐపీఎస్ అధికారులైన భార్యాభర్తలు టగ్ ఆఫ్ వార్‌లో తలపడ్డారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. బెటాలియన్‌లోని ఏడు కంపెనీలు మూడు రోజులుగా జరిగిన గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఓవర్ చాంపియన్‌గా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం టీమ్ నిలిచింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడాకారులకు పోటీతత్వం ఉండాలని, వయసుతో పనిలేదన్నారు. కమాండెంట్ దీపిక మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి ఉద్యోగ రీత్యా ఎప్పుడూ ఒత్తిడి ఉంటుందని, దాన్ని తగ్గించేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఏపీఎస్పీ స్కూల్ విద్యార్థులు, నటరాజన్ సుబ్రహ్మణ్యం అకాడమీ పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. బెటాలియన్ సిబ్బంది ఆర్కెస్ట్రాతో ఉల్లాసం నింపగా, చివరగా క్యాంప్ ఫైర్ వెలిగించారు.

ఆస్తి పత్రాల అపహరణ

సామర్లకోట: డిపార్టుమెంటు పేరుతో కొందరు తన ఇంటిలోకి ప్రవేశించి విలువైన ఆస్తి పత్రాలను పట్టుకుపోయారని స్థానిక ఏడీబీ రోడ్డులోని మాజేటి నగర్‌లో నివాసముంటున్న మాజేటి కృష్ణ బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కృష్ణభగవాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మాజేటి కృష్ణ ఇంటికి మంగళవారం రాత్రి కొందరు వచ్చారు. పోలీసులమని చెప్పడంతో తలుపు తీయగా లోపలకు ప్రవేశించారు. ఇంటిలోని ఆస్తి దస్తావేజులు తీసుకుని వెళ్లిపోయారు. ఆ సమయంలో మాజేటి కృష్ణ, అతడి భార్య మాత్రమే ఇంటిలో ఉండడంతో వారికి అడ్డుకోలేకపోయారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థినిపై కుక్క దాడి



ఉమామహేశ్వరి మెడపై కుక్క గాట్లు

గోకవరం: వీరలంకపల్లి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం దారుణం జరిగింది. పాఠశాల ఆవరణలో ఓ విద్యార్థినిపై వీధికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న పైడిమళ్ల ఉమామహేశ్వరి సాయంత్రం ఐదు గంటల సమయంలో మరుగుదొడ్డికి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. విద్యార్థినికి మెడ వెనుక, చేతిపై తీవ్రంగా గాయలు కావడంతో ప్రిన్సిపాల్ మంజులా రాణి, ఇతర సిబ్బంది వెంటనే గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్స అందించి పర్యవేక్షణలో ఉంచారు. దీనిపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా పాఠశాలలో డ్రైనేజీ నీరు వెళ్లే వైపు ఉన్న రంధ్రం నుంచి కుక్కలు చొరబడ్డాయన్నారు. వాటిని తరుముతున్నా తిరిగి లోపలకు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉందని, 24 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని వైద్య సిబ్బంది సూచించారన్నారు. విద్యార్థిని తల్లి పాఠశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుందన్నారు.